క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అభయహస్తం, నేతన్నభద్రత, నేతన్న భరోసా తదితర పథకాలను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం చేనేత సహకారం సంఘ సభ్యులు, చేనేత కార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఫిబ్రవరి నెల నుంచే ఆయా పథకాలను అమలు చేయనుండగా అందుకు సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలపడంతో చేనేత, జౌళిశాఖ సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ చేనేత కార్మిక సంఘం బాధ్యులు నారాయణ, సాయిలు, విఠల్, అంబాదాస్, అంజయ్య, కిష్టయ్య, ప్రకాశం, శంకర్, సాయన్న, ఆగమయ్య పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న పోరాటం మరువలేనిది

కాంగ్రెస్ నేత నీలం మధు



ఓబన్నకు నివాళులర్పిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: స్వేచ్ఛ స్వాతంత్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన వడ్డే ఓబన్న సేవలు మరువలేనివని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకొని చిట్కుల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బాల్యమిత్రుడిగా సేనాధిపతిగా చిన్న, సన్నకారు రైతులను వేధిస్తున్న బ్రిటిష్ వారిపై తిరుగుబావుట ఎగురవేసిన ధీరుడని కొనియాడారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దస్తగిరి కృష్ణ, వెంకటేశ్, లక్ష్మణ్, రాజ్‌కుమార్, శ్రీను, అభిరామ్, ఈశ్వర్, గోపాల్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్యలో ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): అయోధ్య రామ జన్మభూమిలో బలరాముడికి ప్రాణప్రతిష్ఠ జరిగి సంవత్సరం కాలం పూర్తయిన సందర్భంగా శనివారం ద్వాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పురోహితుల సంఘం మండల నాయకులు అయ్యప్పస్వామి తెలిపారు. అయోధ్యలో రాముడిని దర్శించి పూజలు చేశామన్నారు. పూజల్లో పాలు పంచుకోవడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. రాముడి అండదండలు అందరిపై ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ స్వామి, శివప్రసాద్ స్వామి, నాగే ష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

విశ్వపాలినిలో చండీయాగం



యాగం చేస్తున్న కిషన్‌సింగ్, తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బల్కంచెల్క తండాలోని విశ్వపాలిని మందిరంలో శనివారం 16వ మాస చండీయాగం ఘనంగా నిర్వహించారు. మందిరం ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్–లలిత దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన అంకుశ్‌శర్మ, మందిరం పురోహితులు మనోజ్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు పఠించారు. హారతి, తీర్థప్రసాదం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో తండా ప్రముఖులు శంకర్, ఖత్రోత్ జైల్‌సింగ్, రాములు, రూప్‌సింగ్, కిషన్, సవాయిసింగ్, మన్మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సంగారెడ్డి: క్రీడలతో మానసికోల్లాసం కల్గుతోందని ఎస్‌ఐ క్రాంతికుమార్ పాటిల్ అన్నారు. చౌటకూర్ మండలం బద్రిగూడెంలో సుల్తాన్పూర్ ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) సీజన్ 5 క్రీడోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. క్రికెట్‌పోటీలను పుల్‌కల్ ఎస్‌ఐ క్రాంతికుమార్ పాటిల్, బీఆర్ఎస్ ఉమ్మడి మండలం సీనియర్ నాయకుడు పటోళ్ల విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సుల్తాన్పూర్ ప్రీమియర్ లీగ్ పేరుతో ప్రతీ ఏటా క్రికెట్‌పోటీలు నిర్వహిస్తుంటారు. వారం రోజుల పాటు కొనసాగే ఈ పోటీల్లో దాదాపు 200 మంది యువకులు పాల్గొంటారని తెలిపారు.

డబ్బవాగు బ్రిడ్జికి మోక్షం కలిగేనా?

- పనులు పూర్తయితే 20 గ్రామాలకు సాకర్యం
- దూరభారం తగ్గించడానికి లింకు రోడ్డు ఏర్పాటు



అసంపూర్తిగా ఉన్న పిల్లోడి, బోడపల్లి బ్రిడ్జి

మునిపల్లి(అందోల్): మండలంలోని పిల్లోడి, బోడపల్లి గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు, ప్రయాణికులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. బ్రిడ్జి పనులు పూర్తయితే రాయికోడ్, ఝరాసంగం మండలాల ప్రయాణికులు మునిపల్లి, సింగూర్ ప్రాజెక్టుకు ఇదే బ్రిడ్జి దారి నుంచి వెళ్తారు. బ్రిడ్జి పనులు ప్రారంభించి 10 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు పూర్తి చేయకపోవడంతో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లోడి, తాటిపల్లి గ్రామాల రైతుల వ్యవసాయ భూములు బోడపల్లి, మన్‌సాన్‌పల్లి గ్రామ శివారులో ఉండడంతో డబ్బవాగు దాటాల్సి ఉంటుంది. డబ్బవాగులో సింగూర్ నీరు నిల్వ ఉండటంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ దారి వెంట ఆయా గ్రామాలకు ప్రయాణించడమే కాకుండా వ్యవసాయ పనులకు రైతులు వెళ్తారు. బ్రిడ్జి పనులు నిలిచిపోవడం, సింగూర్ నీరు నిల్వ ఉండటంతో మన్‌సాన్‌పల్లి గ్రామం నుంచి ప్రయాణించడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు, రైతులు వాపోతున్నారు. దూర భారాన్ని తగ్గించడానికి గత ప్రభుత్వం లింకు రోడ్డు ఏర్పాటు చేసింది. పిల్లోడి, బోడపల్లి మధ్య డబ్బవాగుపై బ్రిడ్జిని ఏర్పాటు చేయానికి నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. బ్రిడ్జి పనులను కాంట్రాక్టర్ అర్ధంతరంగా నిలిపేయడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. లింకు రోడ్లను అభివృద్ధి చేసి ప్రయాణీకులకు దూర భారాన్ని తగ్గించాలని ప్రయాణికులు కోరుతున్నారు. బ్రిడ్జి పనులు పూర్తయితే 13 గామాలకు రాకపోకలు సాగడమే కాకుండా దూరభారం చాలా తగ్గుతుంది. సంబంధిత అధికారులు స్పందించి బోడపల్లి, పిల్లోడి డబ్బవాగుపై అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సాకర్యం కల్పించాలి



బ్రిడ్జి పనులు పూర్తి చేసి రైతులు, ప్రయాణికులకు రోడ్డు సాకర్యం కల్పించాలి. ఆయా గ్రామాల రైతుల వ్యవసాయ భూములు డబ్బవాగు అవతల, ఇవతల ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– చిల్కుల సంగయ్య (పెద్దలోడి)

పనులు ప్రారంభిస్తాం..

మంత్రి దామోదర రాజనర్సింహ్మ త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. నిధులు మంజూరు కాగానే బ్రిడ్జి పనులతో పాటు బీటీ రోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆయా గ్రామాల రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి.

–మధుకర్ (ఏఈపీఆర్)

ఆన్‌లైన్‌లో అభిప్రాయ సేకరణ

- పోలీసుల పనితీరుపై రేటింగ్
- పీఎస్‌లలో ఇప్పటికే క్యూఆర్ కోడ్ ఏర్పాటు
- ఆఫ్‌లైన్‌కు స్వస్తి చెప్పిన పోలీసు శాఖ



అభిప్రాయ సేకరణకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

సంగారెడ్డి జోన్: ప్రస్తుతం పోటీ పడుతున్న ప్రపంచంలో మారుతున్న కాలానికనుగుణంగా ప్రతి ఒక్క అంశం ఆన్‌లైన్ విధానంలోకి మారింది. ఈ క్రమంలోనే పోలీస్ శాఖ సైతం ఆ శాఖ అందిస్తున్న సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు ఆఫ్‌లైన్ విధానానికి స్వస్తి చెప్పి, ఆన్‌లైన్ విధానాన్ని ఎంచుకున్నారు. పోలీసుశాఖ ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అందిస్తున్న సేవలపై అభిప్రాయం నేరుగా తెలిపే అవకాశం కల్పించింది.

పోలీస్ స్టేషన్‌లో స్టిక్కర్లు

రాష్ట్ర డీజీపీ జితేందర్ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. అనంతరం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో క్యూఆర్ కోడ్‌ను అతికించారు. జిల్లావ్యాప్తంగా మొత్తంగా 44 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. అన్ని స్టేషన్లలో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు.

ఐదు అంశాలపై అభిప్రాయం

స్కాన్ చేయగానే ముందుగా భాషను ఎంపిక చేసుకుని తమ పేరుతోపాటు పూర్తి వివరాలు నమోదు చేసి విషయాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు, ఎఫ్ఐఆర్, ఈ–చలాన్, పాస్ పోర్ట్ ధ్రువీకరణతోపాటు ఇతర సేవలలో ఒక అంశాన్ని ఎంచుకుని ఎఫ్ఐఆర్ నంబర్‌తోపాటు సంబంధిత పోలీస్‌స్టేషన్‌ను ఎంచుకోవాలి. పోలీస్ స్టేషన్‌లో రిసీవ్ చేసుకున్న విధానం, మీరు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన విధానం, అందించిన సౌకర్యాలు, మొత్తంగా పోలీసు శాఖ అందించిన సేవలపై అభిప్రాయం చెప్పేందుకు రేటింగ్ సౌకర్యాన్ని కల్పించారు.

> **క్యూ ఆర్ కోడ్‌తో స్వేచ్ఛగా...**
>
> 
>
> ఆన్‌లైన్ విధానంలో భాగంగా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెప్పుకోవచ్చు. అభిప్రాయాలకు అనుగుణంగా మరిన్ని సేవలు అందించేందుకు పోలీస్ శాఖ కషి చేస్తుంది.
>
> –చెన్నూరి రూపేశ్ జిల్లా ఎస్పీ సంగారెడ్డి

ఆర్టీసీ కార్మికులకు భోజనాల ఏర్పాట్లు

నారాయణఖేడ్: సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక బస్సులను నడుపుతున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య ఆదేశాల మేరకు భోజనాలను ఏర్పాటు చేశారు. శనివారం భోజనాలు వండి ప్యాకెట్ ల్లో ఉంచి ఖేడ్ పట్టణంలోని రాజీవ్‌చౌక్ బస్టాండ్‌లో అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్, పీఆర్వో పాండు డ్రైవర్లు, కండక్టర్లకు అందజేశారు. డీఎం మాట్లాడుతూ.. సంక్రాంతిని పురస్కరించుకుని లింగంపల్లి, పటాన్‌చెరు, సికింద్రాబాద్‌లకు ప్రతీ 20 నిమిషాలకు ఒక బస్సును నడుపుతున్నామన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు అందుబాటులో ఉంచిన భోజన ప్యాకెట్లను తీసుకెళ్లాలని సూచించారు.

నిరాధారమైన ఆరోపణలు చేస్తే చర్యలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రామచంద్రాపురం మండలం వెలిమెల భూముల విషయంలో తమ సంస్థపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని గ్రీన్‌మార్క్ డెవలపర్స్ ప్రతినిధులు వేణుమాధవరావు, రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక నాయకులు వారి స్వప్రయోజనాల కోసం కొందరు వ్యక్తులను అడ్డంపెట్టుకుని తమ సంస్థపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ భూమి విషయంలో అధికారులు సర్వే కూడా చేశారని తెలిపారు.

చైనా మాంజా ఉపయోగిస్తే చర్యలు

సంగారెడ్డి క్రైమ్: నిషేధిత చైనా మాంజా వినియోగిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ ఆవరణలో శనివారం ఆయా దుకాణాల్లో తనిఖీ చేశారు. మార్కెట్‌లో హాని కలిగించే మాంజా అమ్మిన, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. జరిమానా, జైలు శిక్ష విధిస్తామని అన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల ఆందోళన

పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్



వాటర్ బెడ్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం బోర్పట్ల మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులు ప్లాంట్ వద్ద పని శనివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఫిల్టర్ బెడ్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి కాంట్రాక్టర్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తున్నప్పటికీ గత ఐదు నెలలుగా తమకు జీతాలు చెల్లించడం లేదని తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమకు ఉద్యోగ భద్రత కల్పించి.. ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు కనీస వేతనం రూ.18000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళన మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా మిషన్ భగీరథ కార్మిక సంఘం అధ్యక్షుడు బాబయ్య. లక్ష్మణ్ కుమారస్వామి రాజు, రవి, నవీన్, విష్ణు, విష్ణువర్ధన్, సత్యనారాయణ, రవీందర్ శ్రీకాంత్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. చైర్మన్ సాయి చరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పట్టణంలో గల మార్కెట్ కమిటీ పండ్ల దుకాణాలు కొన్ని ఖాళీగా ఉన్నాయని, వాటిని వ్యాపారులకు అద్దెకు కేటాయించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, డైరెక్టర్లు శంకర్ పాటిల్, కండెం సుజాత, వంశీరాజ్, మల్‌రెడ్డి, నర్సింలు, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ వడ్డెర కులస్తుల ఆర్థిక ఎదగాలి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): వడ్డెర కులస్తుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ అన్నారు. శనివారం రామచంద్రాపురం పట్టణంలో స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న జయంతిని ఉమ్మడి మెదక్ జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు వరికుప్పల లింగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం నూతన ఏర్పాటు చేసిన ఓబన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, సాయికుమార్, బొంత నరసింహ, అంజయ్య, ముత్యాలు సిద్ధయ్య, పెద్దులు పాల్గొన్నారు.

◆ మంత్రిని కలిసిన మాజీ సర్పంచ్

సంగారెడ్డి: ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను చౌటకూర్ మండలం చక్రియాల గ్రామ మాజీ సర్పంచ్, సర్పంచుల ఐక్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణ శనివారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చక్రియాల గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. శ్రీలక్ష్మీ అనంత పద్మనాభ స్వామి ఆలయం వరకు సిమెంటు రహదారి పనులు పూర్తయ్యాయని మంత్రి దృష్టికి తెచ్చారు. వీలు చూసుకుని ఆలయ సందర్శనకు రావాలని మంత్రిని కోరారు .

◆ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్: స్థానిక భక్తమార్కండేయ పద్మశాలి సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆ సంఘం బాధ్యులతో కలసి ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ ఆవిష్కరించారు. కౌన్సిలర్ వివేకానంద్, రామాలయం కమిటీ బాధ్యులు హన్మాండ్లు, గున్నాల నర్సింహులు, పాండు పద్మశాలి సంఘం బాధ్యులు అనంతం, బషెట్టి పాల్గొన్నారు.

◆ శరణుమేళా ప్రారంభం

జహీరాబాద్ టౌన్: విశ్వ గురువు మహాత్మా బసవేశ్వరుడి ఐక్యక్షేత్రమైన కూడల సంగంలో 38వ శరణుమేళాను శనివారం మహిళా జగద్గురు ప్రారంభించారు. కర్నాటకలోని కూడల సంగంలో ప్రతి సంవత్సరం శరణుమేళా(ఉత్సవాలు) పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. శరణుమేళాకు కర్నాటక, మహారాష్ట్రతో పాటు తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్తారు. బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ ఆధ్వర్యంలో పట్టణం నుంచి భక్తులు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. సంక్రాంతి సమయంలో మహాత్మా బసవేశ్వరుడు సంగమేశ్వరుడి అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు.

◆ భక్తులతో ఆలయాలు కిటకిట

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. విద్యాసంస్థలకు సెలవులు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలతో ఆలయాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఖేడ్ మండలం కొండాపూర్‌లోని విశిష్ట చరిత్ర గల పురాతన హనుమాన్ ఆలయంలో భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరి హనుమాన్ ప్రతిమను దర్శించుకున్నారు.

◆ సభకు తరలిన భెల్ కార్మికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీలో రిజర్వేషన్ వర్గీకరణ అమలుపై జరుగుతున్న మేధావుల సంఘీభావ సభకు శనివారం భెల్ కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీహెచ్ఈఎల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ మాట్లాడుతూ .. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరు గౌరవించాలని సూచించారు.

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పటాన్‌చెరు టౌన్: సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంట వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఇస్నాపూర్ ఏఈ వీరాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. చిట్కుల్ గ్రామం పరిధిలోని సాయిప్రియ కాలనీ, విజేతకాలనీ, రామ్ రాజ్ నగర్, ముత్తంగి, ఇస్నాపూర్‌లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

రింగురోడ్డుతో ట్రాఫిక్ సమస్యలకు చెక్



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ చుట్టూ నిర్మిస్తున్న రింగురోడ్డు వల్ల పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలు తీరుతోందని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. పట్టణ శివారులోని ఖేడ్–కంగ్టి రోడ్డు నుంచి చాందఖాన్‌పల్లి కమాన్ వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖేడ్–కరసుత్తి రోడ్డులోని మనూరు క్రాస్‌రోడ్డు వద్ద 161బీ జాతీయ రహదారి నుంచి మున్సిపాలిటీ చుట్టూ డీఎస్పీ కార్యాలయం వద్ద 161బీ జాతీయ రహదారిని కలుపుతూ ఫార్మేషన్ రోడ్డుగా నిర్మించి.. అనంతరం తారురోడ్డుగా మార్చనున్నట్లు తెలిపారు. అలాగే, పట్టణంలోని నాల్గొవ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ రాజేష్ చౌహాన్‌లు పరిశీలించి నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, నర్సింహులు శంకరానాయక్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షల పేరిట సైబర్ వల

లింకులపై క్లిక్ చేయొద్దు

సంగారెడ్డి క్రైమ్: పండుగల వేళ సైబర్ నేరగాళ్ల కొత్త మోసానికి తెరలేపుతున్నారు. ఏపీకే ఫైల్ రకం వంటి మాల్వేర్ లింకు కలిగిన ఉన్న మెసేజ్‌లు సంక్రాంతి శుభాకాంక్షలు పేరుతో వాట్సాప్‌కి పంపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ రమేష్ మాట్లాడుతూ.. మీ పేరుపై మీ స్నేహితులకు పండగ శుభాకాంక్షల కార్డులు పంపవచ్చని ... కార్డును పొందేందుకు మెసేజ్‌లో ఉన్న లింకుపై క్లిక్ చేయండని వాట్సాప్ మెసేజ్‌లో పేర్కొంటున్నట్లు తెలిపారు. లింక్ ఓపెన్ చేసిన వెంటనే మీ ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హాక్ చేస్తారని, ఫోన్ యాక్సెస్ వారికి వెళ్తుందని వివరించారు. తర్వాత మీ మొబైల్ డేటా, మీ గ్యాలరీ ఫోన్ నంబర్, తదితర డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లే ప్రమాదం ఉంది. ఆ తర్వాత మోసాలకు తెరతీస్తారని పోలీసులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మీ మొబైల్‌కు వచ్చే మెసేజ్ లింకులపై క్లిక్ చేయొద్దని పోలీసులు తెలియజేశారు.

రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేయడం ప్రమాదం



రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనాలు

సంగారెడ్డి క్రైమ్: జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ప్రధాన రహదారులపై వాహనదారులు ఇష్టానుసారంగా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ ఇతరులకు హాని కలిగిస్తున్నారు. సంక్రాంతి సెలవులు మొదలు కావడంతో గురుకుల విద్యార్థులు, ఊర్లకు వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద రాంగ్ రూట్‌లో వాహనాలు వేగంగా నడపడంతో బస్టాంట్‌లోకి వెళ్లే ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అయోధ్య బలరాముని వార్షికోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న చంద్రారెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో హిందూ ధర్మా ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం అయోధ్య రామ మందిర ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కాషాయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ అనే నినాదాలతో విధులన్నీ మార్మోగాయి. కౌన్సిలర్ చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాముని కృపాకటాక్షాలు బొల్లారం మున్సిపల్ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంపత్ రెడ్డి, దీనానాథ్, రాజారామ్, శ్రీమన్నారాయణ, నరేందర్, రోహిత్, రవితేజ, మాంబి మహిళా సేవా సమితి సభ్యులు, హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీల సందడి



న్యాల్‌కల్: ముగ్గులు వేస్తున్న మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వడ్డి గ్రామంలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. హ్యాండ్ టు హ్యాండ్ ఇండియన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి గ్రామ పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ట్రైనర్ శంకర్, నీలంబిక, సుశీలమ్మ, వెంకట్‌గౌడ్, నర్సమ్మ పాల్గొన్నారు.

సదాశివపేటలో ..



సదాశివపేట: శాంతినికేతన్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం శాంతినికేతన్, సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలల్లో మహిళలు, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గాలిపటాలను ఎగురవేసి సంక్రాంతి సంబరాలు జరుపుకొని ఆనందించారు. ముగ్గుల పోటీల్లో మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ , పాఠశాల కమిటీ సభ్యులు అప్రమాది రాచప్ప అన్నపూర్ణ, సభ్యులు పురం రజనీ. కార్యదర్శి సరాఫ్ శ్రీనివాస్, పాఠశాల ప్రధానాచార్యులు సంగమేశ్వర్ మాతాజీలు విద్యార్థిని విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి మోతీమాత జాతర



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు, మోతీ మాత ఆలయం

పకడ్బందీగా భారీ ఏర్పాట్లు

జహీరాబాద్ టౌన్: గిరిజనుల ఆరాధ్య దేవత మోతీమాత(మరిగమ్మ) జాతర ఆదివారం నుంచి రెండు రోజులు కొనసాగనుంది. జాతరకు తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్రాల నుంచి సుమారు 3 లక్షల మంది భక్తులు వస్తారని కమిటీ సభ్యులు అంచనా. ఈ మేరకు ప్రభుత్వ యంత్రాగం భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. మొగుడంపల్లి మండలం ఉప్పరపల్లి తండాలోని మోతీమాత జాతర ఉత్సవాలు ప్రారంభం రోజు భోగ్ బండార్ పూజ, 13న భవానీ మాత పూజ, యజ్ఞం, అమ్మవారికి నైవేద్యం తదితర కార్యక్రమాలు ఉంటాయి. నియోజకవర్గంలోని 54 తండాల నుంచి గిరిజనులు మతపరమైన జెండాలను తీసుకుని కాలినడక ఆలయానికి చేరుకుంటారు. దూరం ప్రాంతాల వారు వాహనాల్లో రాగా మరికొంత మంది ఎద్దుల బండ్లపై వస్తుంటారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో షెడ్లు వేసుకుని అక్కడే ఉంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదేశించారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగు నీటి సౌకర్యం, కరెంట్, పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా చర్యలు తీసుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు కమిటీ అధ్యక్షుడు కేషుసింగ్ తెలిపారు.